# పునర్జన్మ

మొదటి పేజీ తరువాయి

మ్రరి శశిధరరెడ్డి, ముఖేష్ వంటి వారంతా సిఎం అంటే ముఖం మాడ్చుకుంటున్నారు. ఈ సభ విజయవంతం కావడం వారికి సుతరామూ ఇష్టం వుండదు. అందువల్ల వారి నుంచి సహాయ నిరాకరణ తప్ప, సానుకూలత రాదు; రాలేదు.

ఇన్ని అవరోధాలను ఎదిరించి మరీ సభను విజయవంతం చేశాడు ముఖ్యమంత్రి. ప్రచారం జరిగినట్లు ఐదారు లక్షల మంది పోర్లి రాకున్నా మొత్తం గ్రౌండ్ నిండేంత జనం వచ్చారు. అది చాలు. దాన్ని చూసి సోనియాగాంధీ కూడా సంతోష పడినట్లే కన్పించింది. చాలా వుత్సాహంగా మాట్లాడారామె. వెళ్తూ వెళ్తూ వెల్‌డన్ అని కితాబు కూడా ఇచ్చి వెళ్లారు. ఈ ఒక్క మంచి మాటతో గత మూడు నాలుగు నెలలుగా తన పైన తన ప్రభుత్వం పైన క్రమ్ముకున్న విమర్శల మబ్బులన్నీ తొలగిపోయినట్లు సంతోష పడుతున్నాడు రాజశేఖరరెడ్డి గారు.

ఇది వొట్టి సంతోషం కాదు; నిజంగా పునర్జన్మ వంటిదే. కనీసం మరొక ఆరేడు నెలల పాటు తన కుర్చీ గురించి తాను ఆలోచించుకోవలసిన అగత్యం; అధిష్టానం తన గురించి ఏమనుకుంటున్నారో అనే శంక రెండూ లేకుండా పోయాయి. ఆ సంతోషాన్ని ఏ మాత్రం దాచుకోవడం లేదాయన. ముఖ కవళికల లోనే అది ప్రస్ఫుటంగా కన్పిస్తున్నది. శాసనసభ సమావేశాలు ముగియగానే మంత్రివర్గ విస్తరణ, అధికార యంత్రాంగం ప్రక్షాళన చేపడతానని ప్రకటించడం అందులో భాగమే. మంత్రివర్గ విస్తరణ కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గత పది నెలలుగా చకోర పక్షుల వలె ఎదురు చూస్తున్నారు. విరహ తాపంతో అల్లాడి పోతున్నారు. ముఖ్యమంత్రి ప్రకటన వారి మనసులపై తొలకరి జల్లు వలె పడింది.

అయితే మంత్రివర్గ విస్తరణ అంత సులభమా? అందుకు తగిన రాజకీయ ఆత్మబలం రాజశేఖరరెడ్డి గారిలో నిజంగానే వున్నాయా అన్న ప్రశ్నలు వుండనే వున్నాయి. మంత్రి వర్గంలో వున్నవి పది పన్నెండు స్థానాలు మాత్రమే. కానీ వాటికోసం ఎదురు చూసేవారి సంఖ్య యాభై వరకు వుంది. ఒకరికి ఇవ్వడం అంటే ఐదుగురిని శత్రువులుగా మార్చుకోవడం అన్నమాట.

అధికార యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరించాలి అన్న నిర్ణయం మాత్రం అందరి మద్దతు పొందుతున్నది. రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వంలో అత్యంత వివాదాస్పదం అవుతున్నది అధికారుల వ్యవహార శైలి మాత్రమే. చంద్రబాబు కాలం నుంచి కీలక స్థానాలు అంటి పెట్టుకుని వున్న సీనియర్ అధికారులను కదిలించకుండా పరిపాలన చేయడానికి ప్రయత్నించి పెద్ద తప్పు చేశాడు ముఖ్యమంత్రి. ఆయన అనుభవ రాహిత్యాన్ని; అవగాహనా లేమిని; మంత్రుల అవినీతి అలుసు బాగుగా గ్రహించిన అధికారులు పరిపాలనను గబ్బు పట్టిస్తున్నారు. ప్రతి రోజా ప్రభుత్వం ఏదో ఒక వివాదంలో చిక్కుకుపోయే పరిస్థితి కల్పిస్తున్నారు. జిల్లా స్థాయిలో కూడా ఈ సమస్య వుంది. చంద్రబాబు నియమించిన కలెక్టర్లే ఇంకా కొన్ని జిల్లాలలో కొనసాగుతున్నారు. వారికి తెలుగుదేశం మాజీ శాసన సభ్యులు, జిల్లా స్థాయి నేతలతో మంచి సంబంధాలు వున్నాయి. వాటిని వుపయోగించుకుని కొందరు తెలుగు నేతలు కాంగ్రెస్ వాదులకంటే బాగా తమ పనులు చక్కబెట్టుకుంటున్నారు.

ఈ పది నెలల కాలంలో ఏ అధికారి ఎట్లా ప్రవర్తించాడు; ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా సహకరిస్తున్నాడా; లేక ఇబ్బందుల పాలు చేయజూస్తున్నాడా అన్న అంచనా వేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు ముఖ్యమంత్రి. తనను కలవడానికి వచ్చే ఎమ్మెల్యేల నుంచి ఈ సమాచారం రాబట్టాలన్నది ఆయన ప్రయత్నం.

సిఎం నిజంగానే అధికార యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరించగలిగితే ఆయన ఎదుర్కొంటున్న పలు సమస్యలు వాటంతట అవిగా పరిష్కారం అవుతాయి. అయితే అందుకు ఎంతో ఆత్మస్థైర్యం అవసరం. ఐఎఎస్ అధికారులు మహా ప్రమాదకారులు. ఎంత పెద్ద నేతనైనా తప్పుదారి పట్టించడం వారికి వెన్నతోపెట్టిన విద్య. వారి మాటలు వింటే ఒక సమస్య; వినకుంటే మరొక సమస్య. ఒక్కొక్క అధికారి గురించి సమగ్ర అవగాహన ఏర్పరుచు కుంటే తప్ప వారితో నెగ్గుకరావడం సాధ్యంకాదు.



దండి సత్యాగ్రహ స్ఫూర్తితో నెల్లూరులో పాదయాత్ర చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో డిసిసి అధ్యక్షుడు సివి.శేషారెడ్డి, కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జడ్పీ ఛైర్మన్ చెంచలబాబు.



